UNIVERSAL
LIBRARY
OU_204080
UNIVERSAL
LIBRARY

—10,000

NIA UNIVERSITY LIBRARY

Accession No

be returned on or before the date last marked below

శ్రీరస్తు.

# శ్రీసమర్థ రామదాసస్వామి

చెన్నపురి:

వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్ వారిచే

ప్రకటితము.

1931.

All Rights Reserved.

Printed by
V. RAMASWAMY SASTRULU & SONS,
at the 'VAVILLA' PRESS,
Madras.—1931.

# విన్నపము.

శ్రీసమర్థరామదాసస్వామి పరిమితమైన మహారాష్ట్ర దేశమున నవతరించినను అతడు సమగ్రభారత దేశమునకును పరమగురువై యున్నాడు అని యీచరిత్రము భారతీయులకు భగవద్గీతవంటి పరమపవిత్ర గ్రంథమై యున్నది.

మాకు లభించిన సాధనసామగ్రి ననుసరించి మే మిప్పటికీవిధముగ శ్రీసమర్థుని జీవితసంగ్రహమును మాత్రమె ప్రకటించుచున్నాము. అవకాశము అయినపుడు మూలమహారాష్ట్ర గ్రంథముల ననుసరించి విపులగ్రంథమును ప్రకటింపగలము.

ఆంధ్రదేశమున నిట్టి మహానుభావు డొక్కడు నవతరింప లేదు అయినను మహారాష్ట్రులకును మనకును గలసన్నిహిత సంబంధముబట్టి సమర్థుని మనముకూడ ఆప్తుడని తృప్తి పడవచ్చును సమర్థుడు చాలసారులు మన దేశమున సంచరించి మనభాషలో కవిత్వము చెప్పుటవలన కూడ ఇట్లు సంతసించుటకు మన కధికారము కలదు

మా ఆంధ్రసోదరసోదరీమణులు ఈ గ్రంథమును చదివి చిత్తసంస్కారము పొంది సమగ్రమైన విపులజీవితమును ప్రకటించుటకు మాకు ప్రోత్సాహము కలిగింప గోరుచున్నాము.

ఇట్లు,

వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్.

# శ్రీ సమర్థ రామదాసస్వామి.

శ్రీసమర్థ రామదాసస్వామి తన మహారాష్ట్రజాతి మత విషయములయం దౌదాసీన్యమును, సాంఘికములయం దనైకమత్యమును, రాజకీయములందు దాస్యమును అనుభవించుచున్న సందిగ్ధసమయమున నవతరించి, తనయనుపమాన ప్రబోధములవలన దానికి నవశక్తి సంఘటించినమహాత్ముడు. ఆతని కాలమునందును, అంతకు పూర్వమును కూడ ఇట్టి యుద్దేశములు కలవిరాగులు కొందరు లేకపోలేదు; గాని వారితనితో పోల్చుటకు తగరు. ఇతడు జాతి నుద్ధరించుటకే అవతరించెను. చిఱుతవయస్సునందే యితడు కారణజన్ముడని దేశీయులు గ్రహించి యనుసరింపసాగిరి.

తపశ్చర్యానంతరము తనసాంప్రదాయమును వ్యాపింపజేయుటకు బయలుదేఱి యిత డెక్కడకు వెడలినను గడియలలోనే వేలకొలది జను లీతనిపాదములు పట్టి శిష్యులు, భక్తులు, అనుచరులును కాసాగిరి; ఆసేతుహిమాచలమగు భారతదేశమునందంతటను ఇతడు తనసాంప్రదాయమును వ్యాపింపజేసెను. అయితే అది మహారాష్ట్రదేశమునందే స్థిరమై నేటికిని మంచిస్థితిలో నున్నది.

మహమ్మదీయుల దురాక్రమణము నడ్డగించి సాటిలేని మహారాష్ట్రసామ్రాజ్యమును నెలకొల్పిన శ్రీఛత్రపతి శివాజీమహారాజు అవతరించుటకు పూర్వమే అవతరించి, అతడు కార్యరంగమున నుఱుకునప్పటికి రామదాసస్వామి ప్రౌఢుడై,

దివ్యప్రభావసంపన్నుడై, లక్షలకొలది అనుచరులతో పరివృతుడై, అతనిమార్గమును నిష్కంటకము గావించుచుండెను. ప్రారంభమున శివాజీ రామదాసస్వామి ప్రభావము నెఱుగడు; గాని తుకారామస్వామి బోధనలవలన ఇతనియెడల ముగ్ధుడై వెదకి పాదములు పట్టెను.

గురువు భక్తిమార్గమున దేశీయులను సంస్కరించుచుండగా, శిష్యుడు శౌర్యప్రద్ధతిలో యవనులను సంహరించుచు—ఇద్దరువురును మహారాష్ట్ర జాతీయనిర్మాణమును పూర్తి చేసిరి; గావున నేటికిని మహారాష్ట్రులు శివాజీతోపాటు రామదాసస్వామినిగూడ సమానముగ పూజించుచున్నారు. రామదాసస్వామి సమగ్రజీవితమును ప్రకటించుటకై అనేకపండితులు అనేకసంఘములుగా నిర్నిద్రదీక్షతో పరిశోధనలు జరుపుచు ఎప్పటికప్పుడు క్రొత్తసంగతులను ప్రకటించుచున్నారు.

లోకోత్తరమగు మహారాష్ట్ర జాతీయసౌధమునకు దృఢతరమగుపునాది యనదగిన యీసమర్థరామదాసస్వామి క్రీ. శ. ౧౬౦౮ వ సంవత్సరము ఏప్రిల్ నెలలో గోదావరీతీరమునందలి జాంబు అనుగ్రామమున అవతరించెను. తల్లి రాణుబాయి. తండ్రి సూర్యాజీపంతు.

సూర్యాజీపంతు అత్యుత్తమ బ్రాహ్మణ కుటుంబమునకు చేరినవాడు. సహజముగ నతడు బ్రహ్మజ్ఞాని. భగవద్భక్తుడు అతనికి పూర్వము ఇరువదవతరమువాడగు దశరథపంతు జాంబు గ్రామమును నిర్మించి, ఆప్రాంతములకు లఖుమాజీ అనువానిని జమీందారుగ నేర్పరిచి, తాను కులకర్ణియు, పురోహితుడునై విశేషకీర్తి నార్జించెను ఆవృత్తులు రెండును పారంపర్య

ముగ సూర్యాజీపంతుకుగూడ సంక్రమించెను. అగుటచే నాతడు కుటుంబపోషణము నిమిత్తము ఆవృత్తులను జూచుకొనుచు ఐహికవిడంబనముల యెడల నిర్లిప్తతను ప్రకటించుచు తామరాకునందలి జలబిందువువలె సంసారమున అంటియు నంటక కాలము పుచ్చుచుండెను

రాణుబాయియు సూర్యాజీకి తగినగృహిణి. ఆమెయు భక్తురాలు విడంబనములపాలుగాని సాధ్వీమతల్లి ఆమె త్రికరణయా సర్వవిషయములయందును భర్త ననుగమించుచు ఆతనిపాదసేవ చేయుచుండెను

సూర్యాజీ పండ్రెండేండ్ల ప్రాయమునందే శ్రీసూర్యనారాయణమూర్తియెడల అచంచలభక్తుడై, అవసరము కలిగినపుడు వృత్తికి సంబంధించినపను లతిశీఘ్రముగ నెరవేర్చుకొనుచు మిగిలినకాలమంతయు సూర్యోపాసనమందే కడుపజొచ్చెను. ఇట్లాతడు ముప్పదియారేండ్లవయస్సు వచ్చువరకు తదేకదీక్షతో సూర్యోపాసనము చేసెను అప్పటి కాతనియెడల సూర్యనారాయణమూర్తికి అనుగ్రహము కలిగెను వెంటనే అతనికి క్రీ. శ. ౧౬౦౫ వ సంవత్సరమున, ఒకకుమారుడు కలిగెను ఈ ప్రథమ కుమారునకు 'గంగాధరుడు' అని పేరుపెట్టి ఆదంపతులు ఆనందముతో నుండిరి

ఇట్లుండగా మఱి మూడేండ్లకు మనకథానాయకుడగు రామదాసు జనించెను. బాల్యమున ఇతని పేరు నారాయణుడు; గాని కాలక్రమమున రామభక్తిభరితు డగుటవలన రామదాసనియు, భక్తులలో సమర్థుడగుటవలన సమర్థ రామదాసు

అనియు, భక్త్యాదరగౌరవములకు చిహ్నముగా సమర్థ రామదాసస్వామి అనియు పిలువబడసాగెను.

నారాయణుడు శాలివాహనశకము ౧౫౩౦ కీలకనామ సంవత్సర చైత్ర శు ౯ నాడు పగలు రెండుయామముల వేళ జన్మించెను. అది సరిగా శ్రీరాముడు పుట్టినమాసము. శ్రీరాముడు పుట్టినతిథి. శ్రీరాముడు పుట్టినవేళ. ఇట్లగుటవలన తలిదండ్రులును, పండితు లనేకులునుగూడ ఇతని జననమున నేదో విశేషమున్నదని తలంపసాగిరి

ఇందు కుదాహరణముగా నారాయణుడు పుట్టినది మొదలు ఆయింట నన్నియు సమృద్ధిగా నుండసాగెను. శాంతి, సుఖము తాండవమాడజొచ్చెను. ఆగృహామునకును, ఆకుటుంబమునకును నూతన్నశోభయు, విశిష్టతేజస్సును కలిగెను. రాణుబాయికి అవ్యక్తమగు వస్తువేదో లభించినట్లయి తృప్తి, ఉల్లాసము నిండారెను. సూర్యాజీయు వివరింపరాని ఉత్సాహము ఉఱకలు వేయుచుండ తనగార్హస్థ్యము పరిపూర్ణమైనట్లు ఆనందింపసాగెను.

ఇది యిట్లుండ ఆకాలమున ఏకనాథస్వామియను నొక మహాయోగి మహారాష్ట్ర దేశమున మిగుల ప్రసిద్ధుడై యుండెను. అకలుషమైన వైరాగ్యముతోడను, నిశ్చలమగుభక్తితోడను, అభంగురమైన తపశ్చర్యతోడను అతడు మూర్తిమంతమైన బ్రహ్మతేజస్సువలె యొప్పుచు అన్నితెగలజనుల చేతను పూజింపబడుచు స్వధర్మబోధచేసి వారిని మతధర్మాభిమానులుగా చేయుచుండెను.

ఈయేకనాథస్వామిని సూర్యాజీపంతు రాణుబాయితో గూడ సంవత్సరమున కొకమారేగి సేవించి వచ్చుచుండెను. అప్పుడెల్ల స్వామి ఆదంపతులను తనయాశ్రమమున కొన్ని దినము లుంచుకొని వాత్సల్యము చూపుచు రాణుబాయితో "నీకడుపున ఇరువురు మహానుభావు లుదయింపనున్నారు" అని చెప్పుచుండెడివారు. గురునాథు డట్లు సెలవిచ్చినప్పుడెల్ల ఈ యాశీర్వచనముయొక్క పరిణామము నూహింపజాలకయు ఆ దంపతులు ఆమహోన్నతపదవికై యెదురుచూడసాగిరి.

ఏకనాథస్వామి యీశుభాశీర్వచనము గంగాధరుడు పుట్టినపుడే వారికి సఫలమగు చున్నట్లు తోచి, నారాయణుడు పుట్టినప్పుడది రూపొందినట్లు తోచెను అగుటచే వారు స్వామిదీవనయే తమ కీపుత్రరత్నములు లభించుటకు కారణమనియు, వారిభవిష్యత్తును గురించి తామేమియు ఆందోళన మందనక్కర లేదనియు నిశ్చయించుకొని ఆనందభరితులై యుండిరి

నారాయణుడు పుట్టిన కొన్నిమాసములకు ఆదంపతులు తమకుమారుల నిరువురను వెంటనిడుకొని యథాపూర్వముగ గురుదేవుని యాశ్రమమున కరిగిరి సూర్యాజీ గంగాధరుని, రాణుబాయి నారాయణుని స్వామిపాదములమీద పడవైచిరి. అంతట స్వామి ఆబాలకుల—అందును నారాయణుని విలక్షణ తేజస్సును గాంచి ముగ్ధుడై ఆనందపారవశ్యము కన్నులలో నృత్యముసేయుచుండ రాణుబాయిని సూర్యాజీపంతును జూచి "మీజీవితములు ధన్యమైనవి. ఏమన! మీ రెందుకై యుద్భ వించి దంపతులైతిరో అది సఫలమైనది. మన మహారాష్ట్రజాతి

తన్నుద్ధరించువానినిమిత్త మెదురు చూచుచున్నది. ఆయుద్ధారకుడే యీనారాయణుడు ఇతడు ఆంజనేయునియంశమున నుద్భవించెను. ఇప్పుడు కన్నులు తెరువని పసిబిడ్డగానున్న యీ మహానుభావుడు తనదివ్యబోధలవలన మనజాతిని ఆసేతుహిమాచలమగునీభరతఖండమునకు దివ్యజ్యోతిగా నొనరించును. కొలదిదినములయందే శివాంశముతో నొకఛత్రపతి మనదేశమున జనింపనున్నాడు అతనికి గురువై యీనారాయణుడు నరునివలన నారాయణుడువలె అద్భుతకార్యములు చేయించి స్వధర్మరక్ష చేయగలడు. నే నారంభించిన ధర్మకార్యములను గూడ నితడే పూర్తిచేయగలడు నేనితనియావిర్భావము నిమిత్తమే యెదురుచూచుచున్నాను నా కనుదమ్ములకు సూర్యోదయముబోలు నీనారాయణుని యావిర్భావము అయినది కనుక నిక నే నవతారము చాలించెదను" అని చెప్పి ఆబిడ్డలను తన అమృతహస్తములతో నిమిరి, దీవించి, ఆదంపతులను చాల నాదరించుచు తన ఆశ్రమమున కొన్నిదినము లుంచుకొని పంపివేసెను.

తరువాత కొలదిదినములయందే ఏకనాథస్వామి అవతారము చాలించెనని వారికి తెలిసినది తమయెడల అనంత వాత్సల్యముగల ఆస్వామిని తలంచికొని ఆదంపతులు చాల దుఃఖించిరి.

నారాయణునకు యుక్తసమయమున అన్నప్రాశనము, కేశఖండనము, అక్షరాభ్యాసము నయ్యెను నడువనేర్చినది మొదలాతడు ఆటలతో కాలము కడపసాగెను. ఏడుపన్నది యెప్పుడు నెఱుగక సదా హాసన్ముఖుడై యుండుచు నాతడు

తోడిబాలకులను చేర్చుకొని, వారికి మార్గదర్శియై, బోధకుడై, ఆటలాడుకొనుచుండును. ఈడునకు మించిన ఆటలు, అల్లరి చూచి ఇరుగుపొరుగువా రితడు పెద్దపెరిగినతరువాత పెద్దమనుష్యుడుగా నుండడని యనుకొనసాగిరి.

అట్లయ్యు ఉచ్చారణమునందును, గ్రహణమునందును, మనసుపెట్టినప్పుడు చదువుకొనుటలోను ఆతడు చూపు వైశిష్ట్యము గాంచి సూర్యాజీ ఏకనాథునిమాటలు తలంచుకొనుచు అయిదవసంవత్సరము రాగానే ఉపనయనము గావించి ఆవశ్యకములగు వైదికమంత్రముల నుపదేశించుట కొకపండితుని నియమించెను

ఆటలు, అల్లరి చూచి ఉపాధ్యాయుడుగూడ నారాయణుడు పనికిరాడని తలచియే "అయినను చూతు" మని నిరుత్సాహముతోడనే పాఠనము ప్రారంభించెను; గాని దినములు కడచినకొలది తాను చెప్పుటకుముందే గ్రహించుచున్నట్లు శిష్యుడు ముందంజవేయుచుండుట గాంచి ఆయపూర్వ ప్రతిభకు దిగ్భ్రాంతుడై "ఇతనికి పాఠము చెప్పుట ఆటను గాదు" అని గ్రహించి అదిమొదలుకొని జాగ్రత్తగా దలుంపసాగెను.

ఇట్లాతడు విద్యాభ్యాసమున అద్భుతప్రతిభను చూపుచుండియు అల్లరియందును, ఆటలయందునుగూడ క్రమోన్నతినే పొందుచుండెను అతనిక్రీడలలో ప్రధానమైనది చెట్లెక్కుట చెట్టు కనపడుటయే తడవుగ నది యెంతటిదైనను అతడు గబగబ ప్రాకి చిటాచివరికి పోయి కూర్చుండును. ఒకకొమ్మమీదనుండి ఒకకొమ్మమీదికిగూడ అతిసులభముగా

ప్రాకిపోవుచుండును. చేతికఱ్ఱలవలె సన్ననైన కొమ్మలలో గూడ తిరుగుచుండును. తనవెంట రాలేనిబాలకులను చూచి నవ్వుచుండును. చెట్టెక్కలేక క్రిందనే యుండిపోయిన బాలుర మీదికి కాయలు, పండ్లు విసరివైచుచు వానిదెబ్బలకు వారేడ్చినచో—అథవా మూతి బిగించుకొనినచో "మీకొఱకె పడవేసినాను. తినుడు. చేతితో పట్టుకొనలేక మీదపడవైచికొనిన నేనేమి చేయుదును? చాలా? ఇంకను కావలయునా?" అని యిట్లు వారిని మారుదారికి గొనిపోయి తృప్తిపరుచుచుండును.

దినములు కడచినకొలది "నారాయణునితో సరిగ నెవడును చెట్లెక్కజాల" డని ప్రజలు చెప్పుకొనసాగిరి. అతడు చెట్లమీద కోలవలెనే సంచరించుట చూచి తల్లిదండ్రులును, వారివలన ఏకనాథస్వామిమాటలు వినినవారును "ఇతడు ఆంజనేయుని అంశమే" అని నిర్ధారణచేసికొనుచుండిరి.

ఇట్లు నారాయణుడు చెట్లేకాక ఇండ్లుగూడ నెక్కుచు ఒకయింటిమీదనుండి మరొకయింటిమీదికి ప్రాకుచు, గోడలపై పరువులెత్తుచు, చెట్లకొమ్మలమీదనుండి చెరువుల యందును గోదావరియందు నుఱికి యీదుచు—నిట్లు పూర్తిగా ఆంజనేయాంశనే ప్రదర్శించుచుండెను.

నారాయణు డిట్లాటలలో మునిగియుండినను విద్యాభ్యాసమునెడల నశ్రద్ధవహింపలేదు. ఒకదెస గురువును, మరియొకదెస గంగాధరుడును శ్రద్ధ వేయుచుండుటవలననేగాక సహజమగు జ్ఞానతృష్ణవలనగూడ నాతడు మాతృభాషయగు మహారాష్ట్రమును, దేవవాణియగు గీర్వాణమును బాగుగా

నభ్యసించి, ఉపనిషత్తులు, భగవద్గీత, తద్భాష్యములు మున్నగు ఆధ్యాత్మికవిద్యాగ్రంథములను దృఢదీక్షతో పరిశీలించి, వేదార్థముగూడ చెప్పుటకు ప్రజ్ఞసంపాదించెను.

అతని విద్యాభ్యాసము నిరంతరముగా జరుగుచుండగా సూర్యాజీపంతు పరలోకవాసి యయ్యెను. అన్నదమ్ములిరువురును అత్యంతభక్తిశ్రద్ధలతో తండ్రికి ఔర్ధ్వదైహికక్రియలు కావించిరి.

ఆటలాడుచును, విద్య నభ్యసించుచును, సాంసారిక కృత్యములుచేయుచునుగూడ నారాయణుడు శ్రీరామ చంద్రుని శ్రవణమననధ్యానాదిమార్గములలో సేవించుచుండెను. సూర్యాజీ మరణించినతరువాత నతనిభక్తి విజృంభించుటయేగాక వైరాగ్యముగూడ అంకురించి, ప్రబలెను.

తమ్మునియంత ప్రఖ్యాతపురుషుడు, ప్రభావసంపన్నుడును గాకపోయినను గంగాధరుడును శ్రీరామమంత్రమును జపించుచు మంత్రసిద్ధిపొందెను. నారాయణుని ఆంజనేయాంశముగ భావించునట్లు జనులు గంగాధరుని సూర్యనారాయణాంశముగ భావించుచుండిరి. అతనిభక్తిప్రపత్తులు నియమనిష్ఠలును అందుకు ప్రోద్బలకముగనె యుండుటవలనను, అతని రామోపాసనావృత్తాంతము జనులకందరకును దెలిసియుండుట వలనను అనేకులు అతనివలన మంత్రోపదేశము బడసి, పూజించుచుండిరి గంగాధరుని ఉపాసన, శిష్యుల ఆగమనము, వారి యుపదేశముల బాహుళ్యము—ఇదియంతయు నారాయణుని రామభక్తికి మరింత యుత్తేజక మగుచుండెను.

ఒకనాడు గంగాధరు డొకశిష్యునకు మంత్రముపదేశించి, భక్తిమార్గమును వివరించిచెప్పి పంపివేసిన పిదప నారాయణుడు మెల్లగ చేరి "నాకును శ్రీరామచంద్రుని పూజింప గోరిక కలదు; గావున నాకును మంత్రోపదేశము గావింపు" మని ప్రార్థించెను గంగాధరుడు తమ్మునిభక్తికి, శ్రద్ధకు, దీక్షకు నానందించెను; గాని ఉపదేశముచేయుటకు మాత్రము సాహసింపకపోయెను "తమ్ముడా! నీ వింకను చిన్నవాడవు చదువుకొనవలసిన విద్య, ఆర్జింపవలసిన జ్ఞానము, గడింపవలసిన అనుభవము—వీనివలన బలపరుచుకొనవలసిన వైరాగ్యము చాల నధికముగా గలవు. నీభక్తికి ఆనందమే, గాని అది ఉపదేశము పొందనంతమాత్రమున వ్యర్థమైపోదు; గావున నింకను కొంచెముకాలము ఓపికపట్టుము" అని యాతడు చాలదూరము చెప్పి, 'తమ్ముని తృప్తిపరిచితి' ననుకొనియెను, గాని నారాయణు డంతతో నూరకుండలేదు. ఎంత ప్రార్థించినను అగ్రజు డట్లే చెప్పుట గమనించి యాతడు ఊరికిబయటనున్న ఆంజనేయాలయమునకు మఱలెను.

లోకపావనియగుగోదావరి. ఆగోదావరిగట్టున పావని (ఆంజనేయుని) ఆలయము. ఆయాలయమున పావనహృదయుడగు భక్తుని తపస్సమాధి. ఇట్లు సన్నివేశమంతయు పావనమే యగుటవలన అచిరకాలమునందే ఆంజనేయుడు నిజరూపముతో సాక్షాత్కరించి నారాయణుని బుజ్జగించి "వత్సా! నీ కోరికయే" మని యడిగెను.

సహజమగు మౌగ్ధ్యము. ఆపైని ఆనందపారవశ్యము. ఈ రెండుకారణములవలన నారాయణుడు ఉపోద్ఘాత

**మును** పెంచజాలక వెంటనే తనయుపదేశతృష్ణనెరింగించి బద్ధాంజలియై నిలువ మారుతి "వత్సా! నీవాంఛ, నీభక్తి, నీదీక్ష—ఇవియన్నియు నచంచలములే అందు కానందమే; గాని నీ వయస్సు చాలలేతది నీదేహ మింకను ఉగ్రనిష్ఠలకు తాళదు. కొంతకాలము నిరీక్షింపుము" అని చెప్పెను; గాని నారాయణుడందుకు అంగీకరింపలేదు "మహానుభావా! నాదేహము ఉగ్రనిష్ఠకు తాళజాలనపుడు నాజిహ్వామాత్రము నీతోడిదీర్ఘవాదమునకు తాళజాలునా? ఎప్పటివరకో **వేచియుండుటకు** మాత్రము నాహృదయము తాళజాలునా? శ్రీరామమంత్రజపమునకు వయస్సుతో బనియేమి?" అని యిట్లు ఆతడు తన ఆత్రము నెరింగించెను.

అంతట చేయునదిలేక ఆంజనేయుడు నారాయణునకు వెంటనే శ్రీరామచంద్రమూర్తిదర్శనము కలుగజేసెను

ఆంజనేయసందర్శనమువలన నారాయణునకు సకలమును పరిపక్వమై యుండెను. ఆకారణమువలన అతడు శ్రీరామచంద్రుని అనేకవిధముల స్తుతించెను శ్రీరాముడును నారాయణుని భక్తిశ్రద్ధలకు, దీక్షకు ఆనందించి, అతని జన్మకారణమును స్మరించి వెంటనే "శ్రీరామజయరామ, జయజయ రామ" అని త్రయోదశాక్షరి నుపదేశించి "వత్సా! ఆర్యధర్మము అంతయు విలుప్తమై పోవుచున్నది. నీవు దాని నుద్ధరింపవలయును. ఈకార్యము నీవలననే కొనసాగగలదు. నీవు కృష్ణాతీరమున వసించి జ్ఞానోపాసనామార్గములచు పెంపుచేసి ఆర్యజాతి నుద్ధరింపుము. నీకు కుడిభుజమై అనార్యదళనము

గావించి నీభక్తిమార్గమును ప్రతిష్ఠింపగలరాజు అవతరింప గలడు" అని చెప్పి తిరోహితుడయ్యెను.

నారాయణునకు పరమానందమయ్యెను. ఈసంగతి యంతయు తెలియగాగంగాధరునకు, రాణుబాయికి ఆప్తులకును గూడ పరమానందమయ్యెను.

ఈతీరున తనభక్తి సంస్కృతమై, తననిష్ఠ నిశితమై, తన దీక్ష నిరర్గళము కాగా నారాయణుడు ఇది పగలు, ఇదిరాత్రి యనుభేదములేకుండ రామభజనము, రామస్మరణము, రామ ధ్యానము—ఇట్లు శ్రీరామపూజ ప్రారంభించెను.

గంగాధరు డప్పటి కప్పుడే భార్యతో కాపురముచేయు చుండెను. అగుటవలన రాణుబాయికి నారాయణుడుగూడ అట్లే భార్యతో సుఖపడుచుండ చూడగోరిక కలిగెను.

యుక్తసమయమున రాణుబాయియు, గంగాధరుడును వివాహప్రయత్నములు ప్రారంభించిరి; గాని నారాయణు డందు కుత్సాహము చూపకపోవుటయేగాక నిరసనభావముగూడ చూపెను. అయినను వారు తత్ప్రియత్నములు మానలేదు. అది చూచి యతడు "ఇక లాభములే" దని తలచి అడవులకు పారిపోయెను.

రాణుబాయి విచారవివశ కాగా గంగాధరుడు పోయి, వెదకి, చాలకష్టముమీద నారాయణుని పట్టుకొని తీసికొని వచ్చెను; గాని అతనియెదుట వివాహప్రస్తావము చేయుట లాభములేనిపని యని గ్రహించెను. మఱియు నాతడు తమ్ముడు మనుష్యమాత్రుడు కాడు. అతనిని మనము తేలికగా చూచుట

తగదు. అతనిసంగతి ఏకనాథస్వామి సాకల్యముగ చెప్పియే యున్నాడు. వివాహప్రయత్న మిక కొనసాగకపోవుట యటుండ మన మింకను ప్రయత్నించెదమేని తమ్ముడు మనకు కనపడుట సంభవింపదు అని తల్లికి చాలదూరము చెప్పెను

అయినను ఆమె కావాంఛ పోలేదు. ఎట్లయిన నారాయణునిగూడ గృహస్థునిచేయవలయు ననునంకల్ప మీాసన్ని వేశమువలన నామెకు మఱింత దృఢపడెను.

ఒకనా డామె నారాయణుని ఏకాంతమునకుకొనిపోయి "నామాట వినవా?" అని యడిగెను. అందుకు నారాయణుడు "విన నని చెప్పగలనా? వినకుండ నుండుటకుగూడ శక్తుడనా?" అనియెను. దానిమీాఁద ఆమె వివాహప్రసంగము ప్రారంభించి "నాయనా! వివాహమంటపమున తెరపట్టునంతవరకు నీవు అడ్డు చెప్పవలదు" అని శాసించెను

నారాయణు డిది విని మొదట నిర్విణ్ణు డయ్యెను; గాని వెంటనే "అమ్మా! అట్లరాగా నీయాజ్ఞ నెరవేర్చెద" నని మాటయిచ్చెను.

రాణుబాయి నారాయణుడువివాహమున కంగీకరించెనని పొంగిపోయెను మరియు నామె "కన్యను చూడుము" అని గంగాధరునకు ఊర్ధ్వశ్వాసతో చెప్పెను.

"అమ్మ భ్రాంతిపడుచున్నది తమ్ము డెట్లును గృహస్థుడు కాడు అయినను చర్చలోనికిదిగిన అమ్మను ఔననిపించుట కష్టము" అని నిశ్చయించుకొని "వ్యర్థప్రయాస" అని యొరింగియే కన్యాన్వేషణము ప్రారంభించెను.

అంతయు సమకూరెను. మఱియు నంతయు నిశ్చయ మయ్యెను. యుక్తసమయమున మగపెండ్లివారు చాలవైభవముగ తరలివెళ్లిరి.

ఇరుదెసలను సన్నాహములు చాలజాగ్రత్తగా చేయబడెను. ముహూర్తము సమీపించినది. నారాయణుడు పీట మీద కూర్చుండెను. పురోహితుడు కర్మకలాపము ప్రారంభించెను.

విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచనము ఇట్లొకట్టొకటే జరిగిపోయినవి. రాణుబాయి హద్దుపెట్టిన తెరయు వచ్చినది. అప్పుడు పురోహితుడు "సావధానమ్" అని హెచ్చరించి మంత్రపఠనము ప్రారంభించెను.

తోడనే నారాయణునిహృదయమున నొకమెఱుపు మెఱసెను. వెంటనే "నేను సావధానుడనే" అనుచు లేచి ఎటకో వెడలిపోయెను.

కొందరు వెంటబడిరి; గాని అతడు దొరకలేదు. చాల మంది వెదకిరి; గాని కాన్పింపలేదు. ఆడపెళ్లివారతనికై నిరాశ చేసికొనిరి. శాస్త్రవేత్తలయభిప్రాయము ననుసరించి ఆబాలిక మరియొకయువకునకు పెండ్లి చేయబడినది. జరిగినది చూచి రాణుబాయి చాల విచారింపగా "ఏమిచేయవచ్చును; తమ్మునకు పెండ్లియనిన సుతరాము నిష్టములేదు. నేను మొదటనే యెరుగుదును. నీకును మొదటనే చెప్పితిని; గాని నీవు విననైతివి. తమ్ముడు వాగ్దానము చేసెనని భ్రమసితివి. అయితే అతడు తనవాగ్దానమును చెల్లించుకొనియే యున్నాడు. నీవే అడియాసపడితివి. ఈసంగతి నేనప్పుడే చెప్పిన "తమ్ముని పెండ్లి

అన్నకు ఇష్టములే" దని లోకులు నన్ను నిందించియుందురు. నీప్రయత్నములన్నియు వ్యర్థములైపోవుట యటుండ తమ్ముడు మనలను విడిచిపోయినాడు ఈవివాహప్రసంగము, ఈప్రయత్నములు లేకుండిన నతడు మనకు నిత్యము నేత్రోత్సవము చేయుచునింటనుండియే యుండును. ఇప్పుడయినను విచారింపవలసినపని లేదు. అతనికేమియు భయములేదు. అత డొందు కీలోకమున నవతరించెనో ఆనిమిత్తముచాల పెద్దది చాలదీర్ఘమైనది; కావున బెంగటిల్లకుము. ఎప్పటికైన నతడు ఇంటికి రాకమానడు. మన మీప్రయత్న మింతటితోనైన మనసులోగూడ లేకుండ జేసికొనినచో అది తమ్ముని శీఘ్రాగమనమునకు కారణముగూడ కావచ్చును" అని గంగాధరు డనేకవిధములబోధించి ఆమె నూరడించెను. రాణుబాయి చేయునదిలేక యాకోరికను కోసి వేసికొనియెను.

వివాహమంటపమునుండి పారిపోయిన నారాయణుని డెందరెంత వెదకినను కనపడలేదు; గాని యత డాప్రాంతము నందే దాగియుండెను జాంబుగ్రామముసమీపమున పంచవటి యను నొకస్థల ముండెను. అత డచ్చట నాలుగైదుదినములు మాత్రమే యుండెను. వెదుకబోయినవారిలో నెవరిదృష్టియు నాస్థలముమీద పడకపోవుటవలన నత డచ్చట సురక్షితముగా నుండగలిగెను.

పిదప నాతడు నాసికచెంతనున్న పంచవటికి బయలుదేరెను వయస్సా చిన్నది. దూరమా వందలకొలదిమైళ్లు. మార్గమా కంటకావృతము. చోరభీకరము. వన్యమృగముల బాధగూడ విశేషముగా నుండెను. అయినను నారాయణుని దృఢదీక్షముం దివియేమియు లెక్కకురాలేదు. నిశ్చయముగా

నాతడు నడకప్రారంభించి అనుకొన్న నాటికంటె ముందుగనే గమ్యస్థలము చేరుకొనియెను.

అక్కడ చేయవలసిన క్షేత్రోపవాసాదికము లన్నియు ముగించుకొని, పంచవటియందున్న శ్రీరామచంద్రమూర్తిని సందర్శించి, పిదప సమీపమునందేయున్న టాకలి యనుగ్రామము చేరి, ఊరిబయట నొకపురాతనవృక్షముక్రింద కుటీరము నిర్మించుకొని అందు నివసించెను.

అక్కడనే అతడు తపస్సు ప్రారంభించెను. అరుణోదయమునకు ముందే మేలుకొని, కాల్యకృత్యములు నిర్వర్తించుకొని గోదావరి కరిగి, స్నానమాడి, మధ్యాహ్నమగువఱకును మొలలోతునీటిలో నిలిచి యాతడు తపస్సుచేయసాగెను. ప్రతిదినము నట్లు నీటిలో నుండుటవలన అతనిశరీరము మొలకు క్రిందిభాగమంతయు తెల్లబడిపోయియుండెను. మఱియు నీటిలో నున్నంతసేపును జలచరములు ఆ దేహభాగమును పొడుచుకొని తినసాగెను అయినను అతడు జంకలేదు. వ్రతము విడువలేదు. అతనికి కాయికసుఖముల యెడల నెప్పుడో విరక్తి పుట్టియుండెను. దేహధారణమునకు అవసరమైనంతవఱకే అతడు ఆహారాదికమును గురించి శ్రద్ధచేయసాగెను; గాని పుష్టి, సుఖము కలుగుటకు కాదు. అతనికి కావలసినది ఆత్మశక్తిగాని దైహికశక్తి కాదు.

అగుటవలన రెండుజాములు దాటినపిదప తపస్సు చాలించి యతడు టాకలిగ్రామమున మధూకర భిక్షమెత్తుకొని ఆపరిమితపదార్థములను శ్రీరామచంద్రునకు నివేదించి పిదప తాను భుజించుచు, భోజనానంతరము రామభజనము, రామ

ధ్యానము, రామనామస్మరణము గావించుచు, మరల సాయంత్రము జపమున ప్రవృత్తుడగుచుండెను.

ఇట్లొకటికాదు, రెండుకాదు, పండ్రెండు సంవత్సరములు నిరంతరదీక్షతో అపారతపస్సు గావించిన, అప్పుడు శ్రీరామచంద్రుడు సాక్షాత్కరించి "నీదీక్ష కానందమైనది. నీపట్టువల ప్రశంసాపాత్రముగా నున్నది. ఇంత చిన్నతనమున ఇట్టి ఘోరతపస్సుగావించుట నీకే చెల్లినది ఇక నీవు తపస్సు చాలించి కృష్ణాతీరమున నివసించుచు ప్రజల నుద్ధరింపుము. ఇకముందు నీవుచేయు ప్రతికార్యమునకు నేను చేదోడు వాదోడుగానుండి నీకు విజయము కలిగించుచుందు" నని వర మిచ్చినపిదప నతడు కన్నులుతెరచెను. అప్పటివఱకు నాతని కీ ప్రపంచమేమో, తానెవడో!—

మంత్రసిద్ధియైనది. అయితే దేశస్థితియేమి! ఈజిజ్ఞాసతో నాతడు తీర్థక్షేత్రములు దర్శించుటకు బయలుదేఱెను. పావుకోళ్లు, జపమాల, జోలె, సారకామచుబుర్ర, టోపీ, అంగరకా—ఇవియే యాతని యాస్తి. శ్రీరామచంద్రుని యనుగ్రహమువలన సర్వము తనదే యైనపుడిక తనకు కావలసిన దేమున్నది? లోకోద్ధరణమున కింతకంటె సాధనసామగ్రి యేమున్నది?

పోవుచు పోవుచు పండ్రెండుసంవత్సరములు తనకాశ్రయమిచ్చిన కుటీరమున నాతడు ఆంజనేయస్వామిని ప్రతిష్ఠించి, ఈపండ్రెండు సంవత్సరములయందు తన్నే నమ్మి ఆశ్రయించియుండిన ఉద్ధవగోస్వామిని తదర్చనాదికము నెఱవేర్చుచుండునట్లు నియమించెను.

ఉత్తరమునుండి దక్షిణమునకు, తూర్పునుండి పశ్చిమమునకు—ఇట్లాతడు భారతదేశమంతయు పాదచారియై సంచరించి సకలతీర్థములు, సమస్తక్షేత్రములు సేవించెను. ఈపర్యటనమున నాతడు సకలప్రాంతముల స్థితిగతులు, ప్రజల యాచారవ్యవహారములు, ఔన్నత్యావనతులు, స్వాతంత్ర్యపారతంత్ర్యములు, భావసరణులు, కార్యక్రమములు—సమస్తమును కరతలామలకముగ నెఱింగెను. సంవత్సరములు పట్టిన యీసంచారమున అతనిచేత నొక్క చిల్లిగవ్వయైన లేదు. ఒక్కపైసయైన కర్చుకాలేదు. ఒకని నాశ్రయించలేదు. జోలె చాపిన గుప్పెడుబియ్యము. నోరువిప్పిన వేలకొలది శిష్యులు. ఏకసాంప్రదాయబద్ధమగు భారతదేశమంతయు నాతనికి విశాలకుటుంబ మయ్యెను.

సంతత రామభజనవలన రామదాసని ప్రఖ్యాతిపొందిన నారాయణుడు మధ్యేమార్గముగా కాశీనగరము ప్రవేశించినపు డొకవింత జరిగెను. స్థానికాచారము ననుసరించి సకలమును నెఱవేర్చుకొని రామస్మరణము గావించుకొనుచు నాతడు విశ్వేశ్వరాలయము ప్రవేశించెను. అప్పటికప్పుడే అక్కడ అనేకబ్రాహ్మణులుచేరి స్వామికి అభిషేకము చేసికొనుచుండిరి. అయితే భస్మభూషితసర్వాంగులైన ఆబ్రాహ్మణులకు కాషాయవస్త్ర నిర్మితమగు అంగరకా ధరించియున్న సమర్థుడు భిక్షుకుడగు హీనజాతీయుడుగా కాన్పించెను. ఈదృష్టితో వారు "పోపొమ్ము. ఇక్కడ నీకు పనిలేదు" అని తిరస్కరించిరి.

సమర్థుడు క్షణములో వారి యాభిజాత్యమంతయు గ్రహించెను. అందు కాతడు కోపపడలేదు. అసంతృప్తి పడ

లేదు. మాటగ్రైన అడలేదు "శ్రీరామచంద్రుని సంకల్ప మిట్లు న్నది కాబోలు" నని మనస్సునమాత్రమనుకొని వెంటనే యాతడు గిరుక్కున వెనుకకు మఱలెను. బ్రాహ్మణులు తమమడి చెడిపోలేదనీ, విశ్వేశ్వరుడు మైలపడలేదనీ సంతసించిరి; గానీ లింగ మేదీ?

బ్రాహ్మణు లప్రతిభులైరి. వారంపఱును కులీనులే. వేద వేదాంగవిదులే. కర్మఠులే. తమబ్రాహ్మణ్యమును భద్రముగా కాపాడుకొనవలయు ననుపట్టుదల గలవారే. అయితే యీసర్వ నాశ మేమి?

వారికేమియు తోచలేదు. పదినిముసములు కొట్టుమిట్టా డిరి. తుదకిది యంతయు ఆబైరాగిపని యని నిశ్చయించుకొనిరి.

సమర్థుడు బ్రాహ్మణులచే తిరస్కరింపబడి కొంచెము దూరమున నిలిచి విశ్వేశ్వరునకును, వారికినిగూడ సాష్టాంగ నమస్కారము చేయుచుండెను.

వెంటనే కొందరు బ్రాహ్మణు లాతనిచుట్టును జేరి సందే హించుచునే పాదాభివందనము గావించి "స్వామీ! తెలియక మిమ్ము తూలనాడినాము. మాతప్పు సైరించి మమ్ము క్షమించి, దయచేసి స్వామిని సేవింపవలయును" అని ప్రార్థించిరి.

అదియు నిదియు చూచి వినినవారందఱు నాశ్చర్యపడిరి; గాని రామదాసుఏమియుననలేదు. బ్రాహ్మణులు ప్రత్యుత్థానము గావించి మహారాజును గొనిపోయిన ట్లాతనిని స్వామి యుండు స్థలమునకు గొనిపోయిరి. చూడగా లింగము మఱల యథా పూర్వముగా కాన్పించెను.

బ్రాహ్మణులు నిర్విణ్ణులైరి. యాత్రాపరు లాశ్చర్యచకితు లైరి. సమర్థు డప్పుడును ఏమియుపలుకక స్వామికి అభిషేకము గావించి, ప్రార్థనానమస్కారము లర్పించి వెడలిపోయెను.

కాశీనగరమున నాతడు కొన్ని దినములు నివసించెను. ఆసమయమున నాత డనేకసన్న్యాసులను సందర్శించెను. అనేక విరాగులను చూచెను. పెక్కుమంది తపోధనులను కాంచెను. అందఱతోడను అనేకవిధములైన సంభాషణములు, చర్చలు సాగించెను. అనేకవిషయములు తెలిసికొని, అనేకానుభవములు సంపాదించి తనజ్ఞానభాండారమున పదిలపరిచికొనెను.

కాశీనగరమునందలి హనుమాన్‌ఘట్టమున ఆంజనేయాలయము లేకుండుటచూచి సమర్థు డచట ఆలయమును నిర్మింపించి, ఆంజనేయప్రతిష్ఠ కావించెను.

అక్కడనుండి సమర్థు డయోధ్యకు వెడలెను అది తన యిష్టదైవమగు శ్రీరామచంద్రుని రాజధాని, అక్కడకు వెళ్లగానే అతనికి రామరాజ్యము స్మృతికవచ్చి నేఁటి దేశస్థితి హృదయమును వ్రక్కలుచేసెను. ధర్మము నాలుగుపాదములతో నడచిన ఆప్రభుత్వ మెక్కడ? ధర్మహీనమైన— ధర్మధ్వంసకమైన యీయవనప్రభుత్వ మెక్కడ! సమర్థునకు తల తిరిగిపోయెను. నిట్టూర్పులు వెడలెను.

అయోధ్యానగరమున లోకోద్ధరణమునకు సంబంధించిన అతనిసంకల్పము కశాఘాతము తగిలిన తురంగమువలె విజృంభించెను ఆత్మానాత్మవివేకముగల ఆమహానుభావునకు గూడ ఒక్కక్షణము ఉద్రేకము కలిగెను.

యథాసమయమున సమర్థుడు సరయూనదిలో స్నానముగావించి శ్రీరామచంద్రుని, ఆంజనేయుని సందర్శించి సేవించెను.

పిదప నాతడక్కడను కొన్నిదినములుండి అనేకవిషయములు తెలిసికొని మఱల బయలుదేరెను.

అతడు మార్గవశమున మథుర, బృందావనము, గోకులము మున్నగు అనేకస్థలములకు బోయెను. అన్నిచోట్లను పుణ్యనదులలో గ్రుంకి దేవతాదర్శనము చేసికొని ప్రాపంచికానుభవము గడించెను.

కొన్నిదినములకు సమర్థుడు శ్రీనగరము మున్నగు స్థలములు చూచి పాంచాలమున కరిగెను. పాంచాలము నానకు మహాపురుషులగు సిక్కులకు జన్మభూమి. కొలదిదినములయందే వారికి సమర్థునిసామర్థ్యము తెలియవచ్చెను. వెంటనే సిక్కులగురువు లాతనిని పరవేష్టించిరి. అనేకచర్చలు జరిపిరి. అనేకప్రశ్నలు వేసిరి అనేకవ్యాసఘట్టములను చూపిరి. అనేకసందేహములను నివేదించిరి. అన్నింటను సమర్థుడు తన అపూర్వప్రతిభను గనపరిచెను. వెంటనే ఆగురువులు "మంత్రభిక్ష దయచేయుడు" అని సమర్థుని ప్రార్థించిరి.

సమర్థుడు సిక్కుసాంప్రదాయము లెఱుంగును. సిక్కుల త్యాగశక్తి యెఱుంగును. వారి స్వధర్మప్రేమ, కర్తవ్యనిష్ఠ, శౌర్యసాహసములు, అభిమానిత్వము బాగుగ నెఱుంగును; గావున నాతడు వారిని సంబోధించి "మీమతకర్త యగు నానకు మహాత్ముడు ఈశ్వరుని యవతారము. అతడు ధర్మగ్లాని సంభవించినపుడు ధర్మసమన్వయము చేయుటకై అవతరించి

అంతయు నెరవేర్చెను. ఆయన మహమ్మదీయులచే రామస్మరణము చేయించిన వశ్యవచోనిధి. ఆయన మీకిచ్చిన ధర్మదీక్ష సందిగ్ధము కాదు. సామాన్యము కాదు. మీ కంతకంటె వేఱొక మంత్ర మవసరము లేదు. ఆగురువర్యుని పాదపద్మములను కొలువుడు. ఆమహాత్ముని నామము స్మరింపుడు. ఆదేవదూతయుపదేశముల ననుష్ఠింపుడు. మీ కంతెచాలు. దానితో లోకము ధర్మబద్ధము అగును. మీజన్మలును ధన్యము లగును" అని బోధించెను. ఈపరమతసహనమును, ఈవిశాలమానవ సౌభ్రాత్రమును చూచి ఆసిక్కుగురువులు చకితులై పదేపదే సమర్థునకు సాష్టాంగవందనము లాచరించి దీవనలు పొందిరి.

అక్కడనుండి బయలుదేరి సమర్థుడు హిమాలయమున కరిగెను. అక్కడ బదరీనాథము, కేదారము మున్నగు దివ్యస్థలములు సందర్శించెను. ఎవరికిని సాధ్యముకాని శ్వేతమారుతి గల పర్వతశృంగమును గూడ అధిష్ఠించి మారుతిని సేవించెను. ఒక్క ఆదిశంకరులుతప్ప మరెవ్వరును పోజాలని ఆశృంగమును ఎక్కినందుకు సమర్థునిజూచి అచ్చటివారందరును పరమాశ్చర్యచకితులై విశేషభక్తి శ్రద్ధలతో పూజించిరి.

పిదప సమర్థుడు మఱికొన్ని తీర్థక్షేత్రములు సేవించి మార్గవశమున జగన్నాథక్షేత్రమున ప్రవేశించెను. అక్కడను స్నానములు, స్వామి సందర్శనము, సేవ మున్నగునవన్నియు యథావిధిగా జరిగిపోయెను

జగన్నాథమున పద్మనాభుడనుబ్రాహ్మణుడు సమర్థు నాశ్రయించెను. పద్మనాభునకు మంత్రోపదేశము గావించి సమర్థుడు

అచ్చట మఠము నిర్మించి అందు శ్రీరాముని ప్రతిష్ఠించి ఆమఠ వ్యవస్థ పద్మనాభున కప్పగించి మరల బయలుదేరెను.

ఈప్రయాణమున అతడు దక్షిణదేశయాత్రలన్నియు సేవించెను. లంకాద్వీపమునకు గూడ బోయెను. లంకలో నాతనికి శ్రీరామకింకరులగు విభీషణాంజనేయుల ప్రభావము, భక్తి, త్యాగములు జ్ఞాపకము వచ్చెను. వారు సాధించిన రామ కార్యములన్నియు కన్నులకు కట్టినట్లయ్యెను. దానితో తన కట్టియోగ్యత యెప్పుడు కలుగునని యావేదనకలిగెను. కొన్ని గడియ లాతనికి తాదాత్మ్యము కలిగెను ఆసమయమున అతడు చాల పారవశ్యము ననుభవించెను.

ఇట్లాతడు పండ్రెండుసంవత్సరములు సంచరించి తుదకు మరల పంచవటిచేరెను. ఈదీర్ఘసంచారమున అతనికి అనేక దేశములు, అనేకజాతులు, అనేకభాషలు, అనేకమతములు, అనే కాచారములు, అనేకధర్మములు, అనేకపద్ధతులు, అనేకరుచులు, అనేకప్రభుత్వములు, అనేకకష్టసుఖములు, అనేకహింసాప్రణా ళికలు, శాంతిప్రదములగు అనేకవిధానములు గోచరించెను. బుద్ధి చేతిలోకలచినట్లు, మజ్జిగ తరచుగా వెన్న తేలినట్లు నిశ్చయజ్ఞానము, కర్తవ్యజ్ఞానము కలిగెను.

ఆసేతుహిమాచలమగుభారతదేశమునందంతటనుగూడ నాతనికి యవనుల దురాక్రమణము, దేశీయుల పరితాపము, స్వధర్మభ్రంశము ఇవియే సాక్షాత్కరించెను ఇంతమంది భారతీ యులు విమతస్థులబారింబడి అవస్థపడుటకు కారణము లన్నియు నతనికి గోచరించెను.

పంచవటి చేరినపిదప నతడు శ్రీరామచంద్రుని తలంచి "ప్రభూ! నీకృపవలన కర్మభూమియంతయు చూచివచ్చితిని. సకలతీర్థములయందును గ్రుంకితిని సమస్తక్షేత్రములను సందర్శించితిని. ఎక్కడచూచినను నీలీలలే. ఎందువిన్నను నీగాథలే. జగత్తంతయు శ్రీరామమయముగా నున్నది. నీవు లేనిస్థలము, నీనామము వినబడనిచోటు లేదు. సీతాపతీ! నీ యీ సర్వవ్యాపకత్వమే ఎక్కడను అపాయములు రాకుండ, ధర్మచ్యుతికలుగకుండ నన్ను కాపాడినది. సౌరభమును మలయపవనము ఆకాశమునం దంతటను క్రమ్మించునట్లు నీ ప్రభావమె నన్ని దేశయాత్ర చేయించినది. నీయాశ్రితుడను, నీయనుచరుడను, నీభక్తుడను, నీకింకరుడను, సర్వము నీవే యని నమ్మియున్నవాడ నగు నేను నిమిత్తమాత్రుడను; గాని యీసన్నివేశమున స్వతంత్రుడనుగాను, కారయితవు నీవు. కర్తవు నీవు. మఱియు భోక్తవును నీవు సర్వమును నీవే" అని ఆత్మార్పణము గావించెను.

సమర్థు డక్కడ కొలదిదినములు మాత్రమేయుండి పైఠణ్ పురమునకు బయలుదేరెను. మహాత్ముడగు ఏకనాథ స్వామి సమాధి అచ్చట నుండెను. సమర్థు డాసమాధిని సేవించుకొని గోదావరీ ప్రదక్షిణమునకు బయలుదేరెను.

మార్గమున జాంబుగ్రామము తగిలెను. జన్మస్థానము, శైశవమున విహారరంగమునగు నాగ్రామము అతనిహృదయ మును హరించెను. తా నెక్కినచెట్లు, తాను విహరించిన కొండలు, తా నీదిన జలాశయములు—ఇవన్నియు నతనిని

ముగ్ధుని గావించెను. ఇంతలో మాతృస్మృతి, సోదరస్మృతి గూడ కలిగి అతనిని గ్రామములోనికి లాగివేసెను.

పెండ్లిపీటలనుండి పాఱిపోయిన తరువాత మఱల యిరువదినాలుగేండ్లకు పునర్దర్శనము, సమర్థునిమనస్సు నిజగృహమును చూడగనే గుబగుబలాడెను.

రాణుబాయి సమర్థునిగుఱించి నిరాశ చేసుకొనియెను; గాని అతనిని మఱచిపోలేదు. అతనిని తలచికొనుటతప్ప ఆమెకు మఱియొకపనిలేదు. గృహకృత్యములన్నియు కోడలు సవరించుకొనుచుండుటవలన భుజించుట, ఒకచో గూర్చుండి కుమారుని తలంచికొనుట—ఇంతకంటె నామెకు మఱియొక పనిలేదు.

ఇట్లామె అచేదృష్టిగా నుండుటవలనను, వార్థకము గూడ అలముకొనుటవలనను ఆమెకు దృష్టి చెడిపోయెను. అగుటచే నామె సమర్థుడు ద్వారమున నిలిచియుండుట కని పెట్టజాలకపోయెను. చిరకాలము క్రిందట వినియుండుటవలన "జయరఘువీరసమర్థ. అమ్మా! బిచ్చముపెట్టుము" అని అతడు అడిగినపుడు కంఠస్వరమునుగూడ గుర్తింపజాలక ఆమె'అమ్మా! ఈబైరాగికి బిచ్చముపెట్టుము' అని కోడలిని పిలిచెను.

సమర్థు డపు డామెస్థితి యంతయు గ్రహించి "నీచేతులతో బిచ్చముపెట్టుమమ్మా" యని మఱల నడిగెను. ఈరెండవ ప్రార్థనము చెవినిబడునప్పటి కామెకు పూర్వస్మృతి కలిగెను. వెంటనే ఆమె "నా తండ్రి! నా నారాయణుడు" అనుచు లేవబోవుచుండగా సమర్థుడు తటాలున ఆమెపాదములుపట్టుకొని ఆనందబాష్పములతో వాని నభిషేకించెను.

రాణుబాయి బ్రహ్మానందపడెను. ఆమె ప్రీతితో కుమారునిముఖము నిమురగా తనమృదుహస్తమునకు కర్కశములకు గడ్డము, మీసములు, జటలు తగులగా "నాతండ్రీ! ఎంతవాడవైనావురా?" అని ఆశ్చర్యపడెను. "నాయనా! కన్నులు లేవు. నిన్ను చూచుటకు యోగములేదు. నీముద్దుమోము చూడకుండనే నాకన్నులు చింకికొనిపోయినవి. అని దుఃఖించెను. అదిచూచి సమర్థుడు శ్రీరామపూజా పరతంత్రమగు తన కుడిచేతితో నిమురగా ఆమె కన్నులువచ్చి సకలమును కాన్పింపసాగెను.

తనకు కన్నులువచ్చినందుకు, తనయనుంగుబిడ్డను చూడకలిగినందుకు, అన్నింటికిని మూలము నారాయణుడింతటి ప్రభావముకలవాడైనందుకు నామె ఆనందపరవశయైపోయెను. సకలమును త్యజించిన సన్యాసివలె పరిపూర్ణవిరాగియయ్యును తల్లియొడిలో వ్రాలి నారాయణుడుగూడ బ్రహ్మానంద మనుభవించుచుండెను.

ఇంతలో గంగాధరుడువచ్చెను అతనిని చూచుటయే తడవుగ సమర్థుడు పాదము లంటెను. ఒకక్షణములో అన్న తమ్ముని గుర్తించెను. తోడనే యిరువురును కౌగిలించుకొని మైమఱచిరి.

ఇట్లు మాతృప్రేమను సహోదరప్రేమను త్రెంచుకొనజాలక సమర్థుడచ్చట కొన్నిదినములుండి, ఒకనాడు సెలవిమ్మని తల్లిని, సోదరునికోరి, కష్టముమీదనైనను సరే అనిపించుకొని మఱల బయలుదేఱెను.

అతని ప్రయాణము నిరాటంకముగా జరిగెను. సప్త గోదావరులను, గోదావరీసాగర సంగమస్థలములను సందర్శించి యాతడు దక్షిణతీరముబట్టి మఱల వెనుకకు మఱలి కొలఁదిదిన ములయందే పంచవటిచేరి శ్రీరామచంద్రుని సందర్శించెను.

పండ్రెండు సంవత్సరములవఱకు గృహవాసము, పండ్రెం డేండ్లుతపస్సు, పండ్రెండుసంవత్సరములు దేశాటనము—ఇట్లు ముప్పదియాఱేండ్లకు సమర్థుడు అన్నిటను పరిపూర్ణుడై సకల మునకుసమర్థుడై, సమర్థరామదాసస్వామి అనుఅన్వర్థనామమున కర్హుడై లోకోద్ధరణకార్యము ప్రారంభించుటకు సుపూర్ణమైన యోగ్యత గడించెను.

సమర్థు డింతవఱకును యోగ్యతాసంపాదనము నందే ప్రవృత్తుడై యుండెను; గావున యితరమేమియు తలంపలేదు. ఇపుడు స్వధర్మరక్షకు కంకణముతాల్చెను. ఈదీక్షతో నాతడు దక్షిణమునకు బయలుదేఱెను.

మహాబలేశ్వరమున నాతడు నాలుగుమాసము లుం డెను. అది వర్షాకాలమగుటచే సంచారమునకుగూడ అను వుగా లేకుండెను. ఆస్వల్పకాలమునందే అచట నాతనికి అనేక శిష్యు లేర్పడిరి వారిలో గొప్పపండితులుగూడ నుండిరి. అచటి భారతీయుల నందరి నాతడు భజనలో ప్రవేశపెట్టెను. వారికి ఉపాసనమును ఉపదేశించెను. పిదప నొకమఠమును నిర్మించి దాని నొకశిష్యుని యధీనముచేసి 'మనసాంప్రదాయ మును పోషింపుము' అని ముదల యిచ్చెను.

మహాబలేశ్వరము విడిచి యాతడు అక్కడక్కడ తన సాంప్రదాయమును బోధించుచు కొన్నిదినములకు వాయీ

క్షేత్రము ప్రవేశించెను. అది కృష్ణాతీరము. నదియొడ్డునగల యొక పెద్దరావిచెట్టుక్రింద నతడు మకాముచేసెను. అచటి పండితు లనేకు లతనితో వాదములును, చర్చలును చేసిరి. అనేకప్రశ్న లడిగిరి. తుదకు వారందఱు నాతని అమేయవిజ్ఞానముచే నాకర్షింపబడి పాదముబట్టి శిష్యులైరి. అచటను సమర్థుడు ఒకమఠము నిర్మించి, అందు మారుతిని ప్రతిష్ఠించి తన్నిర్వాహకత్వము నొకశిష్యునిపరము గావించెను.

పిదప నాతడు మాహులీగ్రామము ప్రవేశించెను. అచట నొకపర్వతమును, దానిమీఁద నొక ఆంజనేయాలయమును గలవు. సమర్థుడు ఆయాలయమున నివసించెను. సూర్యోదయాత్పూర్వమే లేచి యాతడు కృష్ణకుబోయి స్నానాదికము నిర్వర్తించుకొని మధ్యాహ్నమువఱకును రామస్మరణము, జపము గావించుకొని అప్పు డూరిలోనికిబోయి, మధూకరము తెచ్చుకొనును. పిదప సాయంత్రమువఱకును భజనము, సాధువులతో ఆధ్యాత్మికవిషయచర్చలు, రాత్రి మఱల భజన, స్మరణము, మననము. ఇట్లాత డక్కడ కొన్నిదినములు గడపి కర్హాడు ప్రాంతమున కరిగెను.

శాహాపురమున అతడు నివసించెను. కొలదిదినములయందే ఆతని సామర్థ్యము వెల్లడియై వేలకొలది శిష్యులు చేరిరి. అచటగూడ నత డొకమఠము నిర్మించి అందు మారుతిని ప్రతిష్ఠించి దాని ధర్మకర్తృత్వమంతయు బాజీపంతు అను నమ్మిన శిష్యున కప్పగించి ముందుకు బయలుదేరెను.

అతడు ఛాపల్‌గ్రామము ప్రవేశించెను. అక్కడి అరణ్యమున గుహాలుగల పర్వతములు అనేకము లుండెను. సమర్థు

డాగుహాలలో నివసించుచు అపుడపుడు గ్రామములకు బోవుచు ధర్మబోధ గావింపసాగెను. అనేకులు శిష్యులైరి. అనేకులు సాధువులైరి. అచటివారందఱును భజనమున, ఉపాసనమున ప్రవృత్తులైరి.

ఇట్లాతడు ఎక్కడికి కరిగిన నక్కడ రామభజన నేర్పుచు జనుల నంఱతెని స్వధర్మనిరతులను గావించెను. ప్రత్యక్షముగా యవనులవలన పీడింపబడుచున్న యాప్రజలందఱును స్వేచ్ఛాస్వాతంత్ర్యములయెడల ముగ్ధులైరి.

ఇదియంతయు శివాజీకి తెలిసెను. తెలియుటయేగాదు. తనకు యవనులతో సంభవించిన పోరాటములయందు సమర్థుని శిష్యులును, అనుచరులును, భక్తులు నగు ఈప్రజల దేశాభిమానము చాల తోడ్పడెను.

ప్రారంభమున శివాజీ తుకారామస్వామివలన ఉపదేశము పొందగోరెను. ఆకాలమున తుకారాముడు మహారాష్ట్రమున ఈడులేనిభక్తుడు. మఱియు హృదయోత్తేజకమగు కవిత్వము చెప్పుటలోను సాటిలేనివాడు అతనికవిత్వము భక్తిరసబంధురమై దేశమంతయు వ్యాపించియుండెను. ఏమారుమూల చూచినను, క్షుద్రునినోటినుండిగూడ వినినను అతని అభంగములే. ఇదంతయుచూడగా శివాజీ కాతనియెడల గురుభావము కలిగెను. మఱికొంతకాలమున కది ప్రబలి దర్శనాపేక్ష అంకురించెను.

వెంటనే యతడు విలువగల కానుక లిచ్చి స్వామిని దీసికొని వచ్చుటకు ఉద్యోగులను బంపెను. అదివఱకే ఆయోగిపుంగవుడు శివాజీ సంగతి యెఱింగి అతని కార్యముల నాశీర్వ

దించుచుండెను. ఈయుద్యోగులవలన మఱికొన్ని వివరములను గూడ విని అతనియెడల చాల నాదరభావము వహించెను; గాని యీకానుకలన్నియు నాతని కెందుకు? అతడు కేవలము భక్తుడు. ముక్తికాముడు. తనసామర్థ్యమును శివాజీవంటి యుద్ధవ్యవసాయికి సూతనోత్తేజకమగునట్లు చేయునిచ్ఛ కల వాడు కాడు.

అగుటచే నాతడు ఆకానుకలన్నియు త్రిప్పివేసి, అభంగ ములతో ఉత్తరము వ్రాసి శివాజీ కిచ్చుట కాయుద్యోగుల చేతి కిచ్చెను.

ఉత్తరమునందలి భావమిది. "నీవు మహారాజవు. నేను విరాగిని. నీవు పంపినవస్తువులు మాకెందుకు? నీవలన మాకు, మావలన నీకు ఏమియు ప్రయోజనములేదు. నీకు తగినవాడు సమర్థుడు ఒక్కడే. అత డిదివఱకే లోకోద్ధరణమున లబ్ధప్రతిష్ఠుడై యున్నాడు. ఆధ్యాత్మికముగా నతడు, ఐహికముగా నీవు జనోద్ధరణము సమముగా చేయుచున్నారు. కావున నీవు సమర్థరామదాసస్వామిని ఆశ్రయింపుము. ఆతనివలన నజ్ఞాన తృష్ణ తీరగలదు. అతడు భక్తులలో ఉత్తమోత్తముడు."

ఇది చూడగానే శివాజీ హృదయము రామదాసుదెసకు మఱలెను. అదివఱకే అతని సంగతులు వినియుండుటవలన ఆ హృదయ మతనిమీద వెంటనే హత్తుకొనిపోయెను.

శివాజీ రామదాసు నారయుటకు ప్రవృత్తుడయ్యెను. వెంటనే అత డల్పపరివారముతో బయలుదేరి జనులవలన తెలిసికొనుచు కొన్ని దినముల కత డున్నయరణ్యము చేరెను.

కాలము స్థలము సమీపించినకొలది శివాజీమనస్సు ఉద్విగ్నము కాజొచ్చెను.

అతడు చాల శ్రద్ధగా వెదకెను; గాని స్వామిదర్శనము కాలేదు ఆయరణ్యమున కొన్ని చెట్లయాకులమీద కొన్ని శ్లోకములు, పద్యములు వ్రాయబడియుండెను. వానిలో సధర్మాభిమానము కూలంకషమైయుండెను. వానినిచూచి శివాజీ యుద్రేకము పొందెను. అవి స్వామికృతములే యని యాతడు నిశ్చయించుకొనియెను; గాని స్వామి యేడీ?

సమర్థుడు ఛత్రపతిశివాజీయొక్క పోకడలు కనిపెట్టుటకై నిభృతస్థలమున నుండెను. అతడంతయుచూచి, అంతయు గ్రహించి ఉప్పొంగెను.

ఒకనాడు సమర్థుడాతని కిట్లొకయుత్తరము వ్రాసిపంపెను అదియు శ్లోకమయమును, పద్యమయమునుగా నుండెను. "ఓమహారాజా! నీనిశ్చయము మేరువువలె నచలమైనది. నీవు ధైర్యమున కాధారము. అనేకజనులకు నాశ్రయస్థలము. రాజయోగివి ఎవనివలన అహోరాత్రములు అసంఖ్యజనులకు నుపకారము కలుగుచున్నదో అతనిఘనతకు సాటికలదా? ఓనరపతీ! నీవు హయపతివి గజపతివి. దుర్గాధిపతివి. మఱియు ధనాధిపతివి. పురందరుడును శక్తియు నీపృష్ఠభాగంబున నుండి రక్షించుచుందురు. రాజా! యశోవంతుడవు. కీర్తిమంతుడవు. పుణ్యవంతుడవు. మఱియు సునీతిమంతుడవు. దేశదేశాంతరములలోని సమాచారములు తెలిసికొనుటలో నీకుగల యనుపమేయచాతుర్యమును, నీసువేకతయు, దానశీలతయు, సుశీలతయు సుప్రసిద్ధములు."

"మాతీర్థక్షేత్రములన్నియు విధ్వస్తములైనవి. బ్రాహ్మణుల యావాస భూములన్నియు నపవిత్రకృతంబులయ్యె. మతము విలుప్తమయ్యె. పృథ్వియంతయు విప్లవపూర్ణంబయ్యె. మీహృదయములో జొరబడి భగవంతుడు గోబ్రాహ్మణసంరక్షణముచేయుటకు మిమ్ము ప్రేరేపించుగాత! మతసంరక్షణచేయుటకు ప్రస్తుతము భూమండలములో నీవంటిరాజు లేదు. కేవలము నీప్రయత్నములవలననే హిందూమతము కొంచెమైననుసజీవముగానున్నది. నీసాహాయ్యమువలననే యనేకమతకార్యము లనుష్ఠింపబడుచున్నది. కల్యాణప్రదుడవగు నోశివరాజా! నీ వనేక దుష్టులను సంహరించితివి. అనేకులభయమును నివారించి యభయదాన మొసంగితివి. మే మిన్నిరోజులు నీరాజ్యములోనున్నను నీకు జ్ఞాపకము వచ్చినవారముకాము. చింత లేదు. నీవు సకలము తెలిసినవాడవు. ధార్మికుడవు నీకు నధికమేమి వ్రాయవలెను? మతసంస్థాపనము చేసినాడనినకీర్తి నీవే సంపాదింపవలయును జుమా. వివిధరాజకార్యములలో నిమగ్నుడవైయుండగా బిలువనిపేరంటమునువలె ఈయుత్తరము నీకు పంపినందులకు క్షమింపవలయును *

ఈయుత్తరముచూచి శివాజీ యుప్పొంగెను. విరాగియు, లక్షలకొలదిజనుల హృదయముల కధినాథుడు నగుసమర్థుడు తనయుద్యమమును, తనపనులను పొగడుచు, తాను చేయవలసిన దింకను ఉద్బోధించుట యనిన తనను దేవతలుగూడ ఆశీర్వదించుచున్నారని యాతడు భావించెను.

---

* కే. వి. లక్ష్మణరావుగారి శివాజీచరిత్ర ౨౩౨-౨౦౦ పేజీలు.

ఈయుత్తరమును జూడగనే శివాజీ స్వామిని కొనివచ్చుటకై పెద్దయుద్యోగుల నర్హపరివారముతో పంపెను. యుక్త సమయమున సమర్థుడు శివాజీకి గురూపదేశము గావించెను. ఆ సమయమున శివాజీ తాను సంపాదించిన రాజ్యమంతయు గురుదక్షిణగా స్వామికి పాదములచెంత నుంచెను.

కాని సమర్థునకు రాజ్యమెందుకు? సమర్థుడు 'వల' దనెను. శివాజీ 'దత్తాపహారక పట్టుచేయుడు' ననెను. దానిమీద సమర్థుడు "అట్లయిన సర్వస్వాతంత్ర్యములతో నీవే మాకొఱకు రాజ్యము పాలింపుము" అని చెప్పెను. శివాజీ మాఱుచెప్పుట కవకాశము లేకపోయెను.

మహారాష్ట్ర రాజ్యాధిపతి సమర్థ రామదాసు తాను ఆతని తాబేదారు. శివాజీ యభిప్రాయ మిది. ఇందుకు ఉదాహరణముగా అతడు తనపతాకమును కాషాయాంబరముతో నిర్మించెను

ఉపదేశానంతరము శివాజీ సకలమును విడిచి గురువు వెంటబడెను అది చూచి గురుడు "నీకిది తగదు. కర్తవ్యము నుండి విచ్యుతుడవు కాకుము గురూపదేశము ఫలము నిట్లు భ్రష్టము చేసికొనకుము" అనిచెప్పెను మఱియు "నీవు క్షత్రియుడవు; గాన క్షాత్రధర్మము ననుసరించి రాజ్యరక్షణము, ప్రజాపాలనము, దేవబ్రాహ్మణులసేవ, మతసంస్థాపనము (యవనాభావము) చేయుము యవనులను గెలిచి నీవు రాజ్యభారమును గ్రహించుటయే రఘుపతి యిచ్ఛ.....ఇక దుర్లభమైన క్షాత్రధర్మ మెట్టిదో వినుము, మృత్యువునకు భయపడువాడు క్షాత్రధర్మము నవలంబింపజాలడు. ఇట్టివా డన్యమార్గముల

వలన పొట్ట నింపుకొనుటయే మేలు. పగఱకు వెన్నిచ్చువానికి నిహాముునందు దుష్కీర్తియు బరమునందు నరకమును గలదు. యుద్ధములో శత్రువులను చంపుచు, చంపుచు మృతుడైన వానికి సద్గతి కలదు. శత్రుహననము చేసి యింటికివచ్చినవీరుడే సౌభాగ్యముల ననుభవించుటకు యోగ్యుడు. ఫిరంగిలోని యినుపగుండు నిర్భయముగా శత్రుసైన్యమధ్యమునకు బోయి నట్లు శత్రువులలోనికి భయమువిడిచి పోవలయును. పురుషుడు సాహసమును పరిత్యజింపగూడదు. కాని దేశకాలపాత్రవివేచనచేసి సాహసము ప్రకటింపవలయును........అనేకజనుల నొక్కచోటికి గూర్పవలయును. వారికి సువిచారము నేర్పవలయును. మిక్కిలి సాహసముతో శత్రువులమీాదికి దండు వెడలవలయును. సంపాదించిన రాజ్యమును సంరక్షించుకొనవలయును. తరువాత అధికరాజ్యము సంపాదింపవలయును. ఇట్లు జగత్తంతయు మహారాష్ట్ర రాజ్యముస్థాపింపవలయును."*

ఇది సమర్థుడనేకసందర్భములలో అనేకపర్యాయములు శివాజీకిచేసిన ప్రోత్సాహసరణి.

ఛాపల్ గ్రామమునందును, తత్ప్రాంతములయందును సమర్థుని శిష్యులు అసంఖ్యాకులైరి. వారి యుపయోగము నిమిత్తము స్వామి యచట నొకమఠమునిర్మించి అందు శ్రీరాముని ప్రతిష్ఠించెను. అచ్చట ప్రతిపర్వమునకు శ్రీరామోత్సవములు మహావైభవముగా జరుగసాగెను.

కరవీరప్రాంతమున శివాజీచక్రవర్తి ప్రతినిధియైయున్న పారాజీపంతుగూడ సమర్థునిశిష్యకోటిలో చేరెను. అతని

---

* కే. వి. లక్ష్మణరావుగారి శివాజీచరిత్ర ౨౩, ౨౮-౨౯ పేజీలు.

మేనల్లుడగు అంబాదాసు సమర్థుని ప్రధానశిష్యులలో ప్రముఖుడయ్యెను. సమర్థునిగ్రంథముల కన్నిటికి నతడె లేఖకుడుగానుండెను. అతనితల్లియు, సోదరుడునుగూడ సమర్థునిశిష్యత్వము బడసిరి. అంబాదాసే కాలక్రమమున కళ్యాణస్వామినై సమర్థునకు కుడిభుజముగా నుండెను.

శిష్యు లనేకులు ప్రార్థించుటవలన సమర్థుడొకసారి పండరిపురమున కరిగి అచ్చట వెలసియున్న శ్రీకృష్ణుని తనయిష్టదైవమగు శ్రీరామరూపముగనే చూచి సేవించివచ్చెను. సమర్థుడు శివాజీప్రార్థనమువలన "పరళి యనుపర్వతదుర్గముపై నేకాంతముగా వాసము" చేయసాగెను. సమర్థుని సందర్శించుట కచటి కనేకసజ్జనులు వచ్చుచుండిరి. ఆకారణమువలన దానికి సజ్జనగడమని పేరువచ్చెను.

ఒకప్పుడు రాణుబాయి "నిన్ను చూడవలయు నని యెంతో ఉబలాటముగా నున్న" దని వర్తమానము చేయగా సమర్థుడు జాబుగ్రామమునకు బోయి కొన్నిదినము లుండెను. ఆసమయమున అనేకబంధువులు, స్నేహితులు వచ్చి సమర్థుని వినుతించిరి. అనేకులు ఉపదేశముపడసి శిష్యులుగూడనైరి.

తరువాత సమర్థుడు ఆంధ్రదేశమునకు బయలుదేఱెను. దేశాటనము సందర్భమునందును, గోదావరీప్రదక్షిణకాలమునందును అత డీదేశమును, ఇందలి మనవారి సౌజన్యమును, బాగుగ గ్రహించియుండుటవలన ఈదేశమనినను, మనవారనినను అతనికి చాల ప్రీతికలిగెను. ఈకారణమువలననే అతడిప్పుడు ఆంధ్రదేశమునకువచ్చి కొంతకాలము నివసించి మనయాంధ్రభాష నభ్యసించి అందు కొన్నిగ్రంథములుగూడ

రచించెను. మన దేశమునఁగూడ అతని కనేకులు శిష్యులైరి. అనేక పండితులు, అనేకసాధువులు నతని సామర్థ్యమును గ్రహించి పూజించిరి.

ఆంధ్రదేశమునుండి సమర్థుడు తంజావూరి కరిగెను. అచటనపుడు శివాజీసోదరుడగు వెంకోజీ పరిపాలనముగావించుచుండెను. అతడు సమర్థు నచట ఒకనెలదినము లుంచుకొని మంత్రోపదేశముబడసెను సమర్థుడచట నొకమఠమునునిర్మించి అందు భికాజీబాబాను ధర్మకర్తగా ఏర్పఱచి "శివాజీయొక్క రూపమును, దీర్ఘాలోచనములును, ప్రతాపమును జ్ఞాపకముంచుకొను" మని వెంకోజీకిచెప్పి, రామేశ్వరమునకు బయలుదేఱెను.

ఇట్లాతడు దక్షిణదేశమున మఱల సంచరించి, అనేక నగరములయందును, గ్రామములయందును మఠములు నిర్మించి అందు తనశిష్యులను మహాంతులుగా నేర్పఱచి కొన్నిదినములకు ఛాపల్ గ్రామము వచ్చిచేరెను

సమర్థుడు దక్షిణదేశయాత్రనుండి వచ్చెనని వినగానే శివాజీవచ్చి సందర్శించెను. అపుడు గురుశిష్యు లనేకవిషయములు మాట్లాడుకొనిరి సమర్థుడు ఛత్రపతి కనేకామూల్య సిద్ధాంతము లెఱింగించెను.

మఱికొన్ని దినములకు రాణుబాయికి చరమదశ సమీపించెను. ఐశ్వర్యముపుష్కలముగా నుండెను. జ్యేష్ఠపుత్రుడగు గంగాధరుడు చాల శ్రద్ధాభక్తులతో సేవలు చేయుచుండెను. ఇట్లామె కేవిషయమునందును లోపము లేకుండెను అయినను

---

*శ్రీ. చి. లక్ష్మణరావుగారి శివాజీచరిత్ర ౪౭ పేజీ,

ఆమె దృష్టియంతయు కడసారిపుకొడుకగు నారాయణుని మీద నుండెను. "ఒక్కసారి నాతండ్రిని చూచినజాలు" నని ఆమె పలకరించుచుండెను

మహానుభావుడు గావున సమర్థుడు తనతల్లికి అవ సానము సమీపించుట, ఆమె తనకొఱకు తపస్సు చేయుచుం డుట దివ్యదృష్టివలన గ్రహించి వెంటనే పోయి, ఆమెపాదము లంటెను. 'ఇకరా' మనుకొనిన నారాయణు డిట్లు హఠాత్తుగా వచ్చి కనబడి ధైర్యము చెప్పుటవలన రాణుబాయి నిర్విచార ముగా దేహము విడిచెను.

అన్నదమ్ము లిద్దఱును తల్లికి చాలభక్తిశ్రద్ధలతోడను వైభవముగను కర్మ చేసిరి సమర్థుడు మఱల సజ్జనగడము చేరు కొనెను.

ఒకప్పుడు సమర్థుడు నిజానందస్వామి మహోత్సవము చూచి కర్హాడునుండి వచ్చుచుండెను వెంట మున్నదిమంది శిష్యు లుండిరి వారు త్వరత్వరగా ప్రయాణము సాగించు చుండిరి రెండుజాములప్రొద్దెక్కను శిష్యులకు క్షుద్బాధ చాల యధికముగా నుండెను; గాని స్వామి వంచినతల యెత్త కుండ అతిశీఘ్రముగ నడచిపోవుచుండెను.

మఱికొంతదూరము పోవునప్పటికి శిష్యు లిక నొక్క అడుగైన వేయలేని స్థితికి వచ్చిరి సరిగ ఆసమయమునకు వారు ఊచబియ్యపు బరువులోనున్న ఒకజొన్నచేని దగ్గఱకు వచ్చుట గూడ తటస్థించెను. అంతట వారికి సాహసింపకున్న లాభము లేదని గురువునకు సంగతియంతయు నివేదించి ఆజ్ఞబడసి కొన్ని

కంకులు విరిచికొని కాల్చుకొని తినసాగిరి. స్వామి నిశ్చింతుడై యొకచో కూర్చుండియుండెను.

కొంతసేపటికి అక్కడకు ఛాత్రపతి వచ్చెను. జరుగు చున్నది చూడగా నాతనికి తల తిరిగిపోయెను. వెంటనే యాతడు చొప్పదంట్లు పెరికి "ఇతడే వీరినాయకు" డని తలచి సమర్థుని బాదసాగెను శిష్యు లిదిచూచి యా క్షేత్రపాలకుని మర్దింపజూచిరి; గాని సమర్థుడు వారించెను. పిదప వారంద అను క్షేత్రపాలకుడు విడిచిపెట్టగా సజ్జనగడము చేరుకొనిరి.

మఱునాడు ఛత్రపతి స్వామికి దగ్గరనుండి మంగళ స్నానముచేయించెను. అప్పు డాతనికి స్వామిదేహమంతయు తట్లుతేరియుండుట కాన్పించెను అందు కాతడు నిర్విణ్ణుడై కారణ మడిగెను; గాని స్వామి యేమియు చెప్పడయ్యె.

భోజనానంతరముసమర్థు డొకచోవిశ్రమించుచుండగా ఛత్రపతి ప్రక్కగదిలో కూర్చుండి ఒకశిష్యుని బుజ్జగించి వాని వలన జరిగినదంతయు తెలిసికొనెను. అది విని సమర్థుడు ఛత్ర పతిని బిలిచి "అత డిక్కడకు వచ్చినపిదప నాకు చెప్పకుండ నేమియు చేయవలదు. వానికి చేయవలసిన శిక్ష నేను తెలిపెద" నని చెప్పెను.

శివాజీ చాల ఆగ్రహించి "వానిని పెడరెక్కలు విఱిచి కట్టికొని రం"డని భటుల కాజ్ఞాపించెను.

మఱునాడు ఛత్రపతి నిండోలగమున రత్నసింహాసన మున నాసీనుడై కొలువుదీఱియుండగా భటు లా క్షేత్రపాల కుని గొనివచ్చిరి. అప్పటికి సమర్థు డర్ధాసనమున నుపవిష్టుడై యుండెను. భటులవలననే సర్వమును దెలిసికొనిన ఆకర్షకుడు

ఆసన్ని వేశము చూడగానే నోటమాటరాక, కాళ్లు గడగడ వడక నిలువలేక, ఏమియు చేయజాలక సింహాసనమునెదుట సాగిలపడెను.

సమర్థుడు అప్పుడు మందహాసముతో "నీచేను సమృద్ధిగా పండుచుండుగాక" అనిదీవించి శివాజీతో చెప్పి వానిని మాన్యముగా వ్రాయించి వానికి ఇప్పించెను.

ఈశాంతమునకు, ఈసహానమునకు పైగా ఈయౌదార్యమునకు శివాజీయేగాక సభయంతయు సమర్థుని ఉచ్చస్వరమున కీర్తించెను. భక్తలభ్యావసరణి అప్పు డెరింగినట్లు వారింకెప్పుడును ఎరుంగలేదు; ఆమాన్యము ఆకర్షకుని వంశమువారే నేటికిని అనుభవించుచున్నట్లు తెలియుచున్నది.

గంగాధరుని సంగతి యిదివఱకే కొంత తెలుపబడినది. సమర్థునివలె నతడు జనోద్ధరణమునకై యవతరింపలేదు; గాని యతడును సమర్థునివలె లోకభక్తుడై విరాగియై యుండెను. గంగాధరుడు గృహస్థుడు. సమర్థుడు బ్రహ్మచారి. సమర్థుడు సంసారము త్యజించి, యిల్లువిడిచి, చాలవఱకు నడవులయందును, కొండలయందునునివసించెను. గంగాధరుడుసంసారమును నిర్వహించుకొనుచు నింటనే యుండెను. ఇంతే భేదము; గాని గంగాధరుడైనను గృహమున నున్నను తామరాకునందలి నీటిబిందువువలె అంటియు నంటక నిర్లిప్తుడై యుండెను.

గంగాధరుడు భక్తివిషయికములగు కొన్ని గ్రంథములనుగూడ రచించెను.

ఇట్లాతడు సదా ఈశ్వరసేవయందే నిమగ్నుడై యుండు వాడు కావున తన కంత్యకాలము సమీపించుట యెఱింగి యీసంగతి తెలుపుచు సమర్థుని తనయింటికి పిలిపించుకొనియెను.

అన్నగారి సెలవగుటయే తడవుగ సమర్థుడు జాబుగ్రామమున కరిగెను. అక్కడ నాత డొకనెలదినము లుండెను. ఈ నెలదినములును వారు ఈశ్వరవిషయికములగు చర్చలయందే నిమగ్నులై యుండిరి. తరువాత సమర్థుడు తనకార్యక్షేత్రమున కరిగెను. సమర్థుడు వెడలిపోయిన కొలదిదినములకే గంగాధరుడు ఇహలోకము బాసెను. ఆతనిగృహిణి పతివ్రతాతిలకము; గావున నతనితో సహగమనము గావించెను ఈ సంగతి విని సమర్థుడు గంగాధరునికుమారులను తనచెంతకు పిలిపించుకొనియెను.

అపుడుశివాజీ కొన్నిగ్రామములుకలిపి జాబుగ్రామము నొకసంస్థానముగా నేర్పఱిచి "దీనిని మీస్వాధీనమున నుంచుకొను" డని ప్రార్థించెను; గాని సమర్థుడు అందు కంగీకరింపక "యిప్పుడుకాదు. మఱియొకప్పుడు చూచుకొందు" మనియెను. ఇట్లు ఆతడు తనసహజవైరాగ్యముతోడనే అనియెను. అయితే అది శివాజీకి మిగుల కష్టముగా తోచెను. "ఈశిష్యునకు శ్రీరామచంద్రుని సేవించుయోగ్యత యుండినచో తామిట్లు సెలవిచ్చియుండ" రనియెను. అపుడు శివాజీమనస్సును గ్రహించి సమర్థుడు "నీయిష్టమువచ్చినట్లేదో కొంచెముగ నేర్పాటు చేయుము" అనిచెప్పెను. వెంటనే ముప్పదిగ్రామములను,

వార్షికముగా నూటయిరువదియొక్క పుట్ల ధాన్యమును శ్రీరామోత్సవములకై యేర్పఱిచి, శివాజీ హృదయమునందలి భారము నడంచుకొనియెను.

శ్రీసమర్థ రామదాసస్వామియొక్క లీలలు మహారాష్ట్ర భాషలో నింక నెన్నియో వర్ణింపబడియున్నవని తెలియుచున్నది. నేటికిగూడ పరిశోధకు లనేకు లింకను సమర్థుని గుఱించి పరిశోధనలుచేసి చారిత్రకాంశములను తఱచితఱచి సిద్ధాంతీకరించి ప్రకటించుచునే యున్నారు.

సమర్థుని శిష్యులసంఖ్య యింతమాత్రమే అని యెవరును చెప్పజాలరు. అది లక్షలను మించియుండు ననిమాత్రమే యూహింపబడుచున్నది. ఆత డెక్కడ కాలిడిన అక్కడనే శిష్యులు చేరుచుండిరి. క్షేత్రస్థలమున నొక్కొ పూటయుండినను వేల కొలది శిష్యులును, కొందరు సాధువులు నగుచుండిరి.

సమర్థుని బోధనలు వినుటవలననే గాక అతనిలీలలు, తుదకు వార్తలు వినిగూడ అనేకులు శ్రీరామభక్తులై రామ భజనము చేయసాగిరి. ఆకాలమున మహారాష్ట్రదేశమున జరుగుచున్నంత రామస్మరణము శ్రీరామచంద్రుడు బ్రతికియుండి ప్రజలను స్వయముగ పరిపాలించునపుడైన జరిగియుండదని చెప్పవచ్చును.

సమర్థుని భక్తి, వైరాగ్యము—ఇవి అనుపమానములే, అచంచలములే; గాని అతనికార్యసిద్ధి వీనివలనమాత్రమే కలుగ లేదు. అమృతముకంటెను మధురమైన అతని కవిత్వమునకు ముగ్ధులై లక్షలకొలదిజను లతని ననుసరింపసాగిరి. ముద్రణావ

కాశనములు, సౌకర్యములు, సాధనములులేని యాకాలమున అతనికవిత్వము అంత జనాకర్షకమై యున్నదనిన నది యెంత మధురమైనదో, యెంతజిగికలదో గ్రహింపవచ్చును. జ్ఞానహీను డగు చండాలునిమొదలు బ్రహ్మజ్ఞానవంతుడగు ఉత్తమబ్రాహ్మణునివఱకు నతనికవిత్వమును సేవించిరి. పిన్నలు పెద్దలు స్త్రీలు, పురుషులు అనుభేదములేకుండ అందఱును అతనిపద్యములను పఠించి ఆనందింపసాగిరి.

సమర్థు డనేకగ్రంథములు రచించెను. వానిసంఖ్య యెంతో యిప్పటివఱకును నిర్ధారణకాలేదు. నేటికిగూడ ఎప్పటి కప్పుడే అతనిగ్రంథములలో అనేకములు బయటకువచ్చు చున్నవి. పరిశోధకుల కింకను తృప్తికలుగలేదు. వారింకను పరి శోధించుచునే యున్నారు. ౧ దాసబోధ, ౨ రామాయణము, ౩ మనస్సంబోధనశ్లోకములు, ౪ చౌదాశతకము, ౫ జనస్వభావగోసావీ, ౬ పంచసమాసి, ౭ జునాటపురుష్, ౮ మానసపూజ, ౯ జునాదాసబోధ, ౧౦ పంచీకరణయోగము, ౧౧ చతుర్థమానయోగము, ౧౨ మానపంచకము, ౧౩ పంచమానము. ౧౪ రామగీతము, ౧౫ సప్తసమాసి, ౧౬ రామకృష్ణస్తవము, సమర్థునిగ్రంథములలో నిప్పటి కివిమాత్రమే ఉపలబ్ధములై యున్నవి.

వీనిలో దాసబోధ నాయకమణియై యున్నది. సకల విష యములు నిందు చర్చింపబడినవి. ప్రపంచమునందలి అత్యుత్తమ గ్రంథములలో నిది యొకటిగా నేడు గౌరవింపబడుచున్నది. "తమ్ము విడిచియుండజాల" నని శివాజీ దీనముగ పలికినపుడు సమర్థు డీగ్రంథము నాతనిచేత నుంచి "నేనే యనుకొని—

అనగా నాకుమారుగా దీనిని సేవింపుము. ఇది సందేహములను తొలగించును కర్తవ్యములను తెలుపును. ధర్మమును జ్ఞాపకము చేయును. క్లిష్టపరిస్థితులలో మనస్సు గజిబిజిపొందియున్నపుడు నిశ్చయజ్ఞానము కలిగించును భీతిని దరిజేరనీయదు. దుశ్చింతలను పారద్రోలును. ఇది గురువులకు గురువు మంత్రులకు మంత్రి. సేనాధిపతులకు సేనాధిపతి. రాజులకు రాజు. నీకు నీయనుచరులకు, నీ రాజ్యమునకు, నీజాతికి ఇది నవశక్తి నిచ్చును. నిన్నుచక్రవర్తిగ చేయును. అవతారపురుషునిగ చేయును" అనిచెప్పెను. నేడీగ్రంథ మనువదింపబడియుండనిభాష ఆర్యభాషగా పరిగణింపబడుటలేదు. దీనిని చదువుచుండినచో శ్రీసమర్థ రామదాసస్వామి సమక్షమున తత్వబోధ వినుచున్నట్లే యుండును.

అస్పృష్టదశమున మహారాష్ట్రభాష ఇట్టిగ్రంథములతోడను, మహారాష్ట్రదేశ మిట్టికవులతోడను నిండియున్నది. ఆకవులు నవరసములను వర్ణించుటకు సమర్థులే; గాని భక్తిరసమున వారు సిద్ధహస్తులు. ఆంధ్రవాఙ్మయము శృంగారముతో నుత్తరంగితమగుచుండగా మహారాష్ట్రవాఙ్మయము భక్తితో సాలంకషమై యున్నది. మతాభినిరతి, భక్తి—ఈ రెండే మహారాష్ట్రసాధువులు సాధించినది. ఇదియే యవనులదాడినుండి ఆ దేశమును కాపాడినది.

మహారాష్ట్రభక్తులందరియందును సమర్థునకు ప్రత్యేకస్థానము కలదు ఆకాలమున తుకారాము, రామదాసు—ఈ యిద్దరే భక్తులలో, సాధువులలో, విరాగులలో నుత్తమోత్తములు. ఆయిరువురిలో శివాజీప్రార్థనమును తుకారాము నిరా

కరింపగా రామదాసు అంగీకరించెను. తుకారామస్వామియే శివాజీకి రామదాసును చూపెను. సమర్థుని ప్రత్యేకత కిదియొక గొప్పగుఱుతు

నాటికిని నేటికినిగూడ భక్తులందఱును తమభక్తి నీశ్వరునిపాదసన్నిధియందే వినియోగించుచున్నారు. సమర్థు డట్లేగాక దానిని మతముదెసకు, ధర్మముదెసకు, దేశముదెసకును గూడ త్రిప్పెను అతడు తనభక్తిప్రభావమువలన మతమన నేమో యెఱుంగనివారిని మతాభిమాన నిరతులనుగా చేసెను. ధర్మజిజ్ఞాసలేనివారిని ధర్మపరులనుగా నొనర్చెను. దేశమునెడల నుదాసీనులై యుండువారిని మఱియు విద్రోహులై యుండువారిని దేశభక్తులుగా మార్చెను. శివాజీఖడ్గమునకు నైశిత్యముగూర్చి యతనికి రక్తపిపాస నధికము చేసెను. మఱియు మహారాష్ట్రజాతికి స్వేచ్ఛ, స్వాతంత్ర్యము జగత్ప్రసిద్ధమైన ప్రశంస కలిగించెను

ఇట్టి యీమహానుభావుడు డెబ్బదిసంవత్సరములకుపైగా యీలోకముననుండి అనేకులను తరింపజేసి తానీభవసాగరమును తరించెను. తన కవసానకాలమువచ్చినదని గ్రహించి యాతడందుకు తగిన సన్నాహములు గావించెను. ఈసంగతి గ్రహించి యాతడన్నమువిడిచి పాలుమాత్రమే త్రాగసాగెను. మాఘబహుళ అష్టమినాడు అతడు తనశిష్యుల కీసంగతి సూచించెను. అతడు తనశిష్యులలో నెవ్వరైన నీసంగతి గ్రహించిరో లేదో యని "రఘుకులతిలకునిసమయము సమీపించినది. కావున సాంగోపాంగముగ భజనము గావింపవలెను" అని

పలికెను. ఇదివిని శిష్యులందఱును మొగమొగములు చూచు కొనుచుండగా ఉద్ధవగోస్వామిమాత్రము దానిభావము గ్రహించి, "అంతిమదినమగునవమిని స్మరింపవలెను. మిగుల శీఘ్రముగా కార్యసిద్ధి కావింపవలెను" అని పూరించెను. అది విని సమర్థుడు మందహాసముగావించెను

నాటిరాత్రియంతయు భజనలతో కోలాహలముగా నుండెను. అనేకశిష్యులువచ్చిరి. అందఱును గురుసార్వభౌముని పరివేష్టించియుండిరి.

తెల్లవాఱెనిది. నవమివచ్చినది. సమర్థుడు మంచమునుండి స్వయముగా దిగి క్రింద కూర్చుండెను. శిష్యుల కాందోళన మధికమయ్యెను. వారందఱును బలవంతపెట్టి శర్కరకలిపినపిండి కొంచెము తినిపించిరి.

తరువాత అందఱును మఱల మంచముమీద కూర్చుండ వలెనని బలవంతపెట్టిరి. సమర్థుడు చాలసేపు వారిని సమాధాన పఱుపజూచెను; గాని లాభములేకపోగా తుదకు "మీరు నన్నెత్తి మంచముమీద కూర్చుండబెట్టు" డని చెప్పెను.

వెంటనే ఉద్ధవు డట్లు చేయజూచెను; గాని యెత్తలేక పోయెను. అదిచూచి ఆకాబాయి యను శిష్యురాలును తోడ్పడెను; గాని లాభములేకపోయినది. తుదకు పదిమందికలిసి ప్రయత్నించినను ఫలము కలుగలేదు. సమర్థు డప్పుడు వారిని దూరముగా నుండ నియమించి వాయువు నాకర్షింపసాగెను. అదిచూచి వారు గోలుగోలున దుఃఖింపసాగగా సమర్థుడు "మీ కేడ్చుటమాత్రమేనా నావలన నేర్చుకొన్నది?" అని యడి

గెను. అందుకు వారు ? "ఇక మే మెవరితోఁ గలిసి భజనసేయు దుము? ఎవరితో మాట్లాడుదుము? మాకు జ్ఞానము కలిగించు వా రెవరు?" అని యడుగగా నతడు "దాసబోధ" మున్నగు నాగ్రంథములు మీకా ప్రయోజనములన్నియు కలిగించును. వానిని మీరు శ్రద్ధగా పఠించితిరేని నాయెదుట కూర్చుండి నాతో మాట్లాడనిలోపము ఉండదు. ఇక మీలోపమును గలుగదు" అని చెప్పి "హరహరా!" యని పదునొక్కపర్యాయము లుచ్చరించి తుదకు రామశబ్దము నుచ్చరించెను.

సమర్థుని నోటినుండి రామశబ్దము వెడలుటయేతడవుగ ఆతని ముఖమునుండి యొకదివ్యతేజస్సు వెలువడి యెదుటనున్న శ్రీరామచంద్రవిగ్రహమున లీనమైపోయెను.

ఈశోభసమయమున శిష్యులు చేయుచున్న రామభజన మున వైలక్షణ్యము కాన్పించెను.

తరువాత సమాధి మున్నగు కార్యములన్నియు చాల వైభవముగా జరిగెను. దేశమునందంతటను దుఃఖసాగర ముప్పొంగెను. శివాజీ అందదుగంట మునిగిపోయెను.

నేటికిగూడ తనవిశిష్టతను కోల్పోని మహారాష్ట్రజాతి యొక్క నవీననిర్మాతచరిత్రము నింతటితో ముగించుచున్నాము. శ్రీసమర్థరామదాసస్వామియొక్క పావనచరిత్రమును వ్రాయుట, చదువుట, తుదకు వినుటయుగూడ జీవితమునకు పవిత్రతకూర్చును. ఈయుద్దేశముతోడనే—యీవిశ్వాసము తోడనే మే మీచరిత్రము నిట్లు వ్రాసి మాఆంధ్రసోదరసోదరీ మణుల కరకమలములయందు సమర్పించుచున్నాము.

దివ్యశరీరధారివై ధ్యానగమ్యుడవైయున్న ఓసమర్థ రామదాసస్వామీ! సెలవు దయచేయుము నీదాసబోధయే మాకు నీభౌతికరూపము. దానినే మే మిక సేవించి ధన్యతం గాంతుము నీయమృతహస్తమును మాశిరమున నిడి మాకు నవశక్తి నొసంగుము. నీవు పలుమారు చూచి మెచ్చియున్న మాఆంధ్రజాతికి నీదాసబోధ సూత్రచైతన్యము సంఘటించునట్లనుగ్రహింపుము.

---

చెన్నపురి: వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్‌వారి
'వావిళ్ల' ప్రెస్సున ముద్రితము.—1931.